10వ పాఠం మే 28-జూన్ 3

# యాకోబు-ఇశ్రాయేలు

సబ్బాతు మధ్యాహ్నము : మే 28

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ఆది 32:22-31; హోషేయా 12:3,4; యిర్మీయా 30:5-7; ఆది 33; ఆది 34: 30-35:29.**

**కంఠతవచనం : "అప్పుడు ఆయన -నీవు దేవునితోను, మనుష్యులతోను పోరాడి గెలిచితివి గనుక ఇక మీదట నీ పేరు ఇశ్రాయేలే గాని యాకోబు అనబడదని చెప్పెను" (ఆది 32:28).**

మంచి చెడులతో కూడిన యాకోబు యొక్క కుటుంబ గాథ కొనసాగుచున్నది. అదే సమయములో నిబంధన వాగ్దానముల యెడల దేవునికున్న విశ్వాస్యతను బట్టి ఆయన హస్తము వారిని నడిపించుచున్నది.

ఈ వారం యాకోబు విషయమై మరికొంత అధ్యయనం చేయబోవుచున్నాము. యాకోబు ఇపుడు లాబాను గృహమును విడిచి తన గృహమునకు తిరిగి వెళ్ళుచున్నాడు. యాకోబు యొక్క విశ్వాస ఘాతుకత్వమునకు బలియైన ఏశావును అతడు ఎదుర్కొనబోవుచున్నాడు. తన సహోదరుని యెడల ఎంతో మోసపూరితముగా వ్యవహరించిన యాకోబును ఏశావు ఏమి చేయబోవుచున్నాడు?

యాకోబు తనకు ఎదురయ్యే ప్రమాద పరిస్థితులను ఊహించుకొని భయపడుచున్న సమయములో తన పితరుల దేవుడు మరొకసారి అతనికి ప్రత్యక్షమై "యాకోబునకు ఆపద తెచ్చు దినము" (యిర్మీయా 30:5-7) అటు తరువాత కాలములో పేర్కొనబడిన దానికి ముందస్తు సూచనగా ఆ రాత్రి దేవునితో పెనుగులాడిన సంఘటనలో మోసగాడు అని పిలువబడిన యాకోబు పేరును "ఇశ్రాయేలు" అనే కొత్త పేరు అతనికి పెట్టబడెను. అప్పటి నుండి అదొక నూతన ఆరంభమునకు కారణమైంది. మరియు అతని పేరు మీదే నూతన జనాంగము లేక దేశము సృష్టింపబడుట ఆరంభమైంది.

వేరొక విధముగా చెప్పాలంటే పితరులు మరియు వారి కుటుంబాలలో జరిగిన సంఘటనలన్నింటిని చూపించుట కొరకు పరిశుద్ధ లేఖనాలలో పొందుపరచి మనుష్యుల ప్రవర్తన ఏవిధముగా ఉన్నను దేవుడు మాత్రము తాను చేసిన వాగ్దానాలను నెరవేర్చాలనే నిబద్ధతతో ఉన్నాడని ఈ పాఠము ద్వారా నేర్చుకొనబోవుచున్నాము.

-జూన్ 4, సబ్బాతు దినమున ఈ వారం పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం మే 29

## దేవునితో పెనుగులాడుట

లాబాను గృహములో నుండి వెళ్ళిన యాకోబునకు వెనువెంటనే దేవునితో మరొక అనుభవము కలిగింది. తన అన్నయైన ఏశావు 400 మందితో (ఆది 32:6) అతనిని ఎదుర్కొనుటకు వచ్చుచున్నాడని తెలుసుకొని యెహోవా దేవునికి మనః పూర్వకముగా ప్రార్థించి ఆయన తన యెడల చేసిన కార్యములన్నింటిని జ్ఞాపకము చేసుకొని యున్నాడు "నీవు నీ సేవకునికి చేసిన సమస్త ఉపకారములకును సమస్త సత్యమునకును అపాత్రుడను (ఆది 32:10) 'కృప' అనగా ఏమైయుందనే విషయాన్ని యాకోబు ఖచ్చితముగా అర్థము చేసుకున్నాడు. అతని యెడల దేవుడేవిధంగా స్పందించాడు?

**ఆది 32:22-31; హోషేయా 12:3,4 చదువుడి. ఈ ఆశ్చర్యకరమైన వృత్తాంతము యొక్క ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఏమైయున్నది?**

..............................................................................................................

అక్కడ చోటు చేసుకున్న సంఘటనలను గూర్చి యాకోబు దుఃఖ పడుచున్నాడు. తన కుటుంబమును కాపాడుకొనుటకు ఏమి చేయగలడో ఆ ఏర్పాట్లను ముగించుకొని ఆ రాత్రికి తానొక్కడే అక్కడ మిగిలిపోయాడు. అప్పుడతనిపై అకస్మాత్తుగా ఒక మనిషి దాడి చేసెను (ఆది 32:24). అక్కడ దేవుని యొక్క సన్నిధి ఉందనుటకు ఆ ప్రత్యేకమైన శబ్దమునకున్న అర్థము సూచించుచున్నది (యెష 53:3) పరలోకపు యాజకుడు "మిఖాయేలు"కు సూచిస్తూ దానియేలు ఆ మాటను ఉపయోగించాడు (దాని 10:5). అదేవిధముగా "యావెహ్ (యెహోవా దేవుడు) యెహోవా సేనాధిపతిగా వచ్చినపుడు" (యెహోషువ 5:13-15) యెహోవా కూడా అదే పదమును వాడెను.

యాకోబు ఆ రాత్రి చేయుచున్న పెనుగులాటలో అతను పెనుగులాడుచున్నది దేవునితో అని తెలుసుకొని తన మాటలలోనే ఈవిధముగా చెప్పియున్నాడు. "నీవు నన్ను ఆశీర్వదించితేనే గాని నిన్ను పోనియ్యననెను'' (ఆది 32:26) అయినప్పటికి అతడు దేవునిని హృదయపూర్వకముగా హత్తుకొని ఆయనను వెళ్ళనీయకుండా చేయుట ద్వారా, తాను క్షమాపణ పొందుటకు మరియు అతడు దేవునితో సత్ప్రవర్తన కల్గియుండుటకు తన అభిమతమును తెలియజేయుచున్నాడు.

జన్మ హక్కును మోసపూరితముగా పొందుటకు యాకోబును నడిపించిన పాపము స్పష్టముగా తనముందు కనబడుతుంది. అతడు దేవునియందు చేసిన వాగ్దానముల యందు నమ్మకముంచకుండా తన స్వశక్తి మీద ఆధారపడి తన కోరికను నెరవేర్చుకోవాలనుకున్నాడు. అయితే దేవుని వాగ్దానాల ప్రకారము అతడు తనకు తానుగా ప్రయత్నము చేయకపోయినా, దేవుడు తన సమయమును ఆయన మార్గములో వాటిని నెరవేర్చేవాడు"-ఎలెన్ జి వైట్, పితరులు ప్రవక్తలు, 197, 198.

అతని పేరు మార్చబడుట ద్వారా తన పాపక్షమాపణ పొందియున్నాడని తాను పొందిన విజయము ద్వారా విదితమగుచున్నది. “అప్పుడు నీవు దేవునితోను, మనుష్యులతోను పోరాడి గెలిచితివి గనుక ఇక మీదట నీ పేరు ఇశ్రాయేలే గాని యాకోబు అనబడదు” అని ఆ దూత చెప్పెను (ఆది 32:28).

**దేవునితో పోరాడుటను గూర్చి నీ సొంత అనుభవము ఏమై యుంది? ఆ విధముగా చేయుట అవసరమేమిటి? అట్టి అనుభవము మనము వ్యక్తిగతముగా కలిగియుండుట ఎందువలన ప్రాముఖ్యము?**

సోమవారం మే 30

## సహోదరులు కలుసుకున్నారు

పెనూయేలు నుండి “ముఖాముఖిగా దేవునిని చూచిన” (ఆది 32:30) స్థలములో అతనికి దేవునితో కలిగిన అనుభవముతో బయలుదేరి తన సహోదరుని కలుసుకొనుటకు యాకోబు వెళ్ళుచున్నాడు. 20 సం॥ల ఎడబాటు తరువాత తన సహోదరుడు 400 మందితో రావడము యాకోబు చూచెను (ఆది 33:1) యాకోబు భయపడుతూనే ఏమి సంభవించినను ఎదుర్కొనుటకు సిద్దపడి తన కుటుంబముతో ఎదురు వెళ్ళుచున్నాడు.

**ఆది 33 చదువుడి. పెనూయేలులో దేవుని ముఖాన్ని చూచిన యాకోబు యొక్క అనుభవమునకు యాకోబు తన సహోదరుని ముఖము చూచిన అనుభవానికి మధ్య ఉన్న సంబంధమేమి? దేవునితో మనకున్న సంబంధం, వారు ఎవరైనా మన సహోదరులతో మనకున్న సంబంధములో దాగియున్న అర్ధమేమిటి?**

యాకోబు తన సోదరుడు సమీపించు వరకు ఏడుసార్లు నేలను సాగిలపడెను (ఆది 33:3) తన సోదరుని యాకోబు “నా ప్రభువు” అని అనేకమార్లు పిలిచెను (ఆది 33:7,13,15) తనను అతనికి “సేవకుడని” చెప్పుకొనెను. (ఆది 33:5లో ఆది 32:4,15,20 పోల్చుడి). ప్రాముఖ్యముగా యాకోబు ఏడుసార్లు నేలను సాగిలపడుటనగా తన తండ్రి నుండి పొందిన ఏడు దీవెనలకు సాదృశ్యముగా ఉన్నది (ఆది 27:27–29) అతడు సాగిలపడినపుడు, తన తండ్రి ఇచ్చిన దీవెనలను తన సహోదరునికి తిరిగి ఇచ్చి వేస్తూ “జనములు నీకు సాగిలపడుదురు నీకు దాసులగుదురు” అని చెప్పెను (ఆది 27:29).

దీనంతటిని బట్టి చూస్తే యాకోబు తాను దొంగిలించిన దీవెనలో తిరిగి తన సహోదరునికి ఇచ్చుటకును, అతనికి ఋణపడినదంతయు తిరిగి చెల్లించి వేయుటకు యాకోబు ఉద్దేశమైయున్నది (ఆది 33:11) ఏశావు తన సహోదరుని చూచినపుడు, ఊహించిన ప్రవర్తనకు విరుద్దముగా యాకోబు చెంతకు పరుగెత్తుకొని వెళ్ళి అతనిని చంపుటకు బదులు “కౌగలించుకొని, ముద్దు పెట్టుకొని ఏడ్చెను (కన్నీరు విడిచెను)” (ఆది 33:4).

తరువాత ఏశావును ఉద్దేశించి యాకోబు ఈ విధముగా వ్యాఖ్యానించాడు. "దేవుని ముఖము చూచినట్లు నీ ముఖము చూచితిని" (ఆది 33:10) అని పలికెను. ఏశావు అతనిని క్షమించెనని గ్రహించి యాకోబు అసాధారణమైన రీతిలో ఆవిధముగా మాట్లాడెను. హీబ్రూ క్రియాపదము "రట్సహ్" సంతోషించెను (ఆది 33:10) అనే పదము వేదాంత శాస్త్రమునకు చెందిన పదమైయుంది. దాని అర్థములో దేవుడంగీకరించిన అర్పణయెడల సంతోషించుట వలన దేవుని యొద్ద నుండి పాపక్షమాపణ లభించుననే భావము అందులో ఇమిడియుంది (లేవి 22:27; ఆమోసు 5:22).

పెనూయేలు యొద్ద దేవుడు యాకోబునకు పాపక్షమాపణ అనుగ్రహించుట ద్వారా అతడు దేవుని ముఖమును చూడగలిగెననే అనుభవముతో ఉన్న యాకోబునకు తిరిగి అదే అనుభవమును తన సహోదరుని నుండి అతని నేరాలు క్షమాపణ పొందియున్నాడని, అందుచే తన సహోదరుని ముఖము దేవుని వలె ఉందని చెప్పెను. రెండవ పెనూయేలు యొద్ద యాకోబు బ్రతికి మొదటి పెనూయేలు యొద్ద బ్రతికి యుండుట రెండవ వాని యొద్ద బ్రతుకుట కొరకే అని అర్థమవుతుంది. యాకోబు దేవుని, సహోదరుని యొద్ద క్షమాపణ పొందెను. అందునుబట్టి నిజముగా మునుపెన్నడూ దేవుని కృప యొక్క అర్థమును పూర్తిగా తెలియని యాకోబునకు ఇప్పుడు పూర్తిగా అర్థమైంది.

**నిన్ను ఇతరులు క్షమించుట ద్వారా (దేవుని కృప కాకుండా) కృపను గూర్చి నీవేమి నేర్చుకొని యున్నావు?**

మంగళవారం మే 31

## దీనా అవమానపర్చబడెను

ఇప్పుడు యాకోబు తన సోదరునితో సమాధానపడుట వలన కానాను దేశములో స్థిరపడి శాంతిగా జీవించాలని కోరుకున్నాడు. "షాలెమ్" అనగా "సురక్షితముగా" (ఆది 33:18) అని అర్థము అదే విధముగా 'షాలోమ్" శాంతి అనే భావముతో మొదటిసారి తన ప్రయాణమంతటిలో వినిపించింది.

ఆ ప్రాంతములో నివసిస్తున్న వారి యొద్ద నుండి కొంత భూమిని కొని (ఆది 33:19) అక్కడొక బలి పీఠమును కట్టించి తాను ఏవిధముగా దేవుని మీద ఆధారపడి జీవిస్తున్నాడో, దేవుని మీద తనకున్న విశ్వాసమును చూపించాడు. ప్రతిసారి బలియర్పణ చేసినప్పుడు దేవునిని ఆరాధించించుట జరిగియుంది.

అయితే మొట్టమొదటిసారి ఆ దేశములో (ఆ ప్రజల మధ్య) నివాసము ఏర్పాటు చేసుకొనుట వలన యాకోబు (ఇశ్రాయేలు) అక్కడ ఎదురైన ఇబ్బందులకు గురి కాబడెను. గెరారు వద్ద అబీమెలెకుతో ఇస్సాకు పరవాసిగా నివసించునట్లు (ఆది 26:1-33) యాకోబు కనానీయుల మధ్య నివసించుటకు ప్రయత్నించెను.

**ఆది 34 చదువుడి. అతడు ఆశించిన శాంతియుత సహజీవమునకు భంగము కలుగునట్లు అక్కడ ఏమి జరిగినది?**

....................................................................................................

అక్కడ సంభవించిన నీచమైన సంఘటన ఆ ప్రజల యొక్క స్వభావము మరియు ప్రజలను బయలుపర్చినది. శరీర సుఖమును ఆశించిన షెకెము దీనాను ప్రేమిస్తున్నట్లు ప్రవర్తించి ఆమెను చెరిపెను. ఆమెను తనతో వివాహము చేయమని అతని తండ్రిని కోరెను. అవసరమైతే అతడు నిబంధన ప్రకారము సున్నతి అనే ఆచార కర్మను కూడా స్వీకరించుటకు అతని ఇష్టమును తెలియపర్చెను.

ఈ సమయములో దేవుని నియమములను, ఆయన ఆజ్ఞలను కాపాడే బాధ్యతగల వారి వలె షిమ్యోను, లేవి ప్రవర్తించి కనానీయులతో పెండ్లికి ఒప్పుకొనలేదు (లేవి 19:29 అబద్ధములు పలుకుచు, మోసము చేయుటకు సిద్ధపడిరి (ఆది 34:13) తరువాత వారు కనానీయులను చంపి వారిని దోచుకొనుటకు సిద్ధమైరి (ఆది 34:25–27) వారి క్రియలు ఆమోద యోగ్యము కానివిగా ఉండుటయే గాక అనేక సమస్యలను సృష్టించుటకు కారకులయ్యారు. యాకోబు మాత్రము శాంతి కోసమే ఎదురుచూసాడు. అతని కుమార్తెను షెకెము మానభంగము చేసినా తెలిసి ఊరకుండెను (ఆది 34:5). ఆ సందర్భములో కుమారులు చేసిన పనిని బట్టి వచ్చే పర్యవసానము గూర్చి కోపముతో వారిని గద్దించెను. "అప్పుడు యాకోబు షిమ్యోనును లేవిని చూచి మీరు నన్ను బాధ పెట్టి యీ దేశ నివాసులైన కనానీయులలోను, పెరిజ్జీయులలోను అసహ్యునిగా చేసితిరి. నా జన సంఖ్య కొంచెమే – వారు నా మీదికి గుంపుగా వచ్చి నన్ను చంపెదరు. నేనును నా యింటి వారును నాశనమగుదుమని చెప్పెను" (ఆది 34:30).

**మరొకసారి మోసము, దగా చేయుట మనము చూస్తున్నాము. అదే సమయములో బైబిలునందున్న సమాచారమును బట్టి దయ, కృపకు సంబంధించిన క్రియలు కూడా జరుగుచున్నవి. ఈ విషయాలన్నియు మానవ స్వభావము గూర్చి ఏమి చెప్పుచున్నవి?**

బుధవారం **జూన్ 1**

## విగ్రహారాధన వ్యాపించియున్నది

**ఆది 34:30–35:15 చదువుడి. ఇక్కడ సంభవించిన దానిని బట్టి నిజమైన ఆరాధన గురించి ఏ పాఠములను నేర్చుకొనవచ్చు?**

....................................................................................................

యాకోబు శాంతియుతముగా జీవించుటకు అతడు కనానీయులతో రాజీపడవలసి వచ్చినదనియు (ఆది 34:30) మరియు అతని ఇద్దరు కుమారులను గద్దించిన తరువాత

(ఆది 34:30) దేవుడు యాకోబుతో మాట్లాడి అంతకు పూర్వము తనతో చేసిన నిబంధనను తిరిగి క్రొత్తదగునట్లు చేయుటకు అతడు షెకెమును విడిచి బేతేలునకు తిరిగి వెళ్ళి అక్కడ ఒక బలిపీఠమును నిర్మించమని చెప్పెను.

యాకోబునకు దేవుడిచ్చిన ఆజ్ఞ తరువాత మొదటగా వ్రాయబడిన విషయమేమంటే, యాకోబు తన ప్రజలను కనాను దేశమునకు చెందిన విగ్రహములేమైన వారి యొద్ద ఉన్న యెడల ముఖ్యముగా యాకోబు కుమారులు షెకెము పట్టణమును కొల్ల గొట్టినప్పుడు తీసుకొని వచ్చిన విగ్రహములను వారి వారి గృహ దేవతలకు సంబంధించిన విగ్రహములను వారి యొద్ద నుండి తీసివేయమని ముఖ్యముగా రాహేలు దొంగిలించిన తన తండ్రి గృహములోని విగ్రహాలను తీసివేయమని చెప్పెను (ఆది 31:19,32). దేవునితో చేసుకొనిన నిబంధన విషయములో ఇవేవియు ఆటంకములుగా ఉండకూడదు.

యాకోబు దేవునికి పరిపూర్ణముగా సమర్పించుకొనినను, తన కుటుంబ సభ్యులు బహుశ విగ్రహాలను పూజిస్తూ ఉండేవారేమో కానాను పలుకుబడి నుండి వెలుపలకు వచ్చుటకు యాకోబు షెకెము పట్టణమును విడిచి పెట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. యాకోబు వారి నివాస గృహాలలో ఉన్న విగ్రహాలను వారి హృదయములో ఉన్న విగ్రహాలను తొలగించవలసిన అవసరము ఎంతైనా ఉన్నది.

మారుమనసు పొందడమనునది భౌతికముగా ఒక ప్రాంతము నుండి మరొక ప్రాంతమునకు తరలి వెళ్ళిపోవుట కాదు గాని లేక ఒక సంఘము నుండి వేరొక సంఘములోనికి మారడం కాదు గాని ముఖ్యముగా దేవుని కృపను కోరినవారమై విగ్రహారాధనను మన హృదయములలో నుండి తీసివేయవలసియున్నది. మనము ఎక్కడ జీవించినా, దేని నుండైన విగ్రహములను తయారు చేసుకొనగలము. అందుచేత జాగ్రత్త వహించాలి.

యాకోబు దేవునికి విధేయత చూపించుచు ఆయన ఆజ్ఞ ప్రకారము ఒక స్థలము నుండి లేక వేరొక స్థలమునకు వెళ్ళిపోయినను, దేవుడు చివరిగా కలుగజేసుకొని "వారు ప్రయాణమై పోయినప్పుడు దేవుని భయము వారి చుట్టునున్న పట్టణముల మీద నుండెను గనుక వారు యాకోబు కుమారులను తరుమలేదు" (ఆది 35:5). అంతట యాకోబు తన ప్రజలందరితో కలిసి దేవునిని ఆరాధించుటకు సిద్ధమయ్యాడు (ఆది 35:6) ఆవిధముగా కుటుంబము యొక్క ఐక్యత మరల తిరిగి వారి గృహాలలోనికి వచ్చెను. యాకోబు ఆ స్థలమునకు "ఎల్ బేతేలు" అను పేరు పెట్టెను. యాకోబునకు కలిగిన ఒక కలలో వచ్చిన నిచ్చెన "తనతో పరలోకము సంబంధము కలిగియుందనే గురుతుగా ఉన్న అతడు మొదటగా దేవుని చేత శపింపబడిన స్థలము గుర్తుకు వచ్చింది.

ముందుసారి వలె కాకుండా ఈసారి బేతేలు స్థలము మీద కాకుండా, బేతేలులోని

దేవుని మీద వారి దృష్టి పెట్టిరి. ఈ విధమైన వ్యక్తిగత అనుభవమును బట్టి అతడు యాకోబు కాదు గాని "ఇశ్రాయేలు" అని పేరు మార్చుట ఎక్కువ ప్రాధాన్యత పొందింది (ఆది 35:10). యాకోబు యొక్క దీవెన అనగా మొదటి అర్థము ఫలించుట అంటే తన సంతానము నుండి మెస్సియా రావడము మరియు అనేక జనములు ఆ సంతానము నుండి ఏర్పడుట (ఆది 35:11). రెండవది అది వాగ్దాన భూమిని చూపించుట (ఆది 35:12).

**చాలా కుటిలమైన మార్గములలో విగ్రహారాధన మన హృదయాలలోనికి ప్రవేశించును. దాని విషయమై మనము ఏమి చేయగలము?**

గురువారం జూన్ 2

## రాహేలు యొక్క మరణము

**ఆది 35:15-29 చదువుడి. ఒక కుటుంబముగా మెలగలేని అతని కుటుంబములో యాకోబు ఎదుర్కొనిన ఇతర దుఃఖములు ఏమిటి?**

యాకోబు బేతేలును విడిచి వెళ్ళిన వెంటనే అతడు వాగ్దాన భూమికి చేరుకునే ప్రయాణము యొక్క చివరి భాగములో, ఒక దానితో ఒకటి సంబంధమున్న మూడు సంఘటనలు చోటు చేసుకున్నాయి. యాకోబు యొక్క చివరి కుమారుడు జన్మించాడు. రాహేలు మరణించింది. లేయాకు పుట్టిన యాకోబు యొక్క మొదటి కుమారుడు రూబేను యాకోబు యొక్క ఉప పత్నితో శయనించెను. అటువంటి ఘోరమైన పనిని ఆ యవనస్తుడు ఎందుకు చేసాడో ఈ వాక్యములు వివరించుట లేదు గాని, బహుశః యాకోబు కనిష్ట కుమారుని జన్మను అవమానపర్చుటకు, రాహేలును గూర్చిన జ్ఞాపకాల విషయమై యాకోబును గర్వ భంగము చేయుటకైనను కావచ్చును. ఆ విషయములో మనకు ఏమీ తెలియదు.

యాకోబు యొక్క చివర కుమారుని యొక్క జన్మము బెత్లెహేముతో ముడిపడి యున్నది (ఆది 35:19) బెత్లెహేము వాగ్దాన భూమి పొలిమేరలలో ఉన్నది. అందును బట్టి ఆ బాలుడు జన్మించుటకు ఇశ్రాయేలు యొక్క భవిష్యత్తును గూర్చి చేయబడిన వాగ్దానము యొక్క మొదటి నెరవేర్పుగా పరిగణించవచ్చును. అబ్రహామునకు దేవుడు సెలవిచ్చినట్లు "భయపడకుము" (ఆది 35:17ను ఆది 15:1తో పోల్చి చూడుడి). అనే రీతిలోనే ఆ మంత్రసాని ప్రవచన రూపములో రాహేలుతో దేవుడు పలికిన మాటలు పలికెను.

ఆ సమయములో మరణ దశలో ఉన్న రాహేలు తాను అప్పుడే జన్మనిచ్చిన కుమారునికి 'బెనోని' అనగా 'దుఃఖ పుత్రుడు' అని తన బాధను గుర్తు చేసుకొని నామకరణము చేసింది. ఆ పేరును యాకోబు 'బెంజిమీను' అనగా తనకు కుడి భుజముగా ఉండే కుమారుడవుతాడని మార్చి వేసెను. ఆ సమయములో వారి ప్రయాణములో

దక్షణమ వైపున వాగ్దాన భూమి ఉన్నది. అది దేవుడు వాగ్దానము చేసిన భూమి. ఆ దిశగా వారు ప్రయాణము చేయుచున్న సమయములో కుమారుడు జన్మించాడు గనుక ఆ దిశను సూచించే విధముగా నామకరణం జరిగి యుంటుంది.

అదే సమయములో రాహేలు దాసియైన బిల్హాతో అనగా యాకోబు యొక్క ఉపపత్నితో రూబేను లైంగిక సంబంధమును కలిగియున్నాడు. (ఆది 35:25; 30:3) ఆ అవమానకరమైన పనిని రూబేను ఎందుకు చేసాడో మనకైతే తెలియదు గాని అది మాత్రము మానవ దిగజారుడుతనానికి ఉదాహరణగా మిగిలిపోయింది.

అటువంటి అవాంఛనీయ సంఘటన జరిగినట్లు యాకోబునకు తెలిసినను అతడు ఏవిధంగాను స్పందించలేదు (ఆది 35:22). ఆ సమయములో తన జీవితములో అతడు దేవుని మీద ఆధారపడి, అటువంటి పాపము, దుర్మార్గము సంభవించినను దేవుడు తన వాగ్దానము నెరవేరుస్తాడని అనుకొని యుండవచ్చును.

ఇశ్రాయేలు యొక్క పితరులైన యాకోబు యొక్క 12 మంది కుమారులు అంత మంచివారుగా కనబడకపోయినను (ఆది 35:22-26) వారిలో ఎన్ని సమస్యలున్నను దేవుని యొక్క చిత్తము ఈ కుటుంబము ద్వారా నెరవేరుచున్నదనే విశ్వాసము ఈ పాఠము ద్వారా అర్థమగుచున్నది.

**మానవ తప్పిదములున్నను దేవుని యొక్క చివరి లక్ష్యము నెరవేరబోవుచున్నది. ఒకవేళ ఆ ప్రజలు దేవునితో ఏకీభవించి, ఆయనకు విధేయులై జీవించి యున్న యెడల ఏమి సంభవించెడిదో ఊహించుకోండి. అదే జరిగియుంటే దేవుని యొక్క ప్రణాళికలు ఎంత సులభంగా తక్కువ మానవ శ్రమతో ఆలస్యము లేకుండా నెరవేరి యుండేవో ఆలోచించండి?**

**శుక్రవారం** **జూన్ 3**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్ యొక్క పితరులు మరియు ప్రవక్తలు పుటలు 195-203లోని పెనుగులాడిన రాత్రి చదవండి.

యాకోబు ఆ రాత్రి పెనుగులాడిన అనుభవము మరియు ఆవేదన క్రీస్తు యొక్క రాకడకు ముందు దేవుని ప్రజలు పొందవలసిన అనుభవమైయున్నది. దుష్ట శక్తులతో దేవుని ప్రజలు కడవరి దినములలో యాకోబు వలె పెనుగులాడవలసియున్నారు. దేవుడు తన ప్రజల యొక్క విశ్వాసమును పరీక్షిస్తాడు. వారు పరీక్షింపబడుచుండగా వారి యొక్క పట్టుదల, దేవుడు వారిని అంధకార శక్తుల నుండి విడుదల చేస్తాడనే నమ్మకము బయలుపడతాయి. వారి యొక్క పరిస్థితి బహు దయనీయమైనదిగా ఉందని వారిని సాతానుడు

భయపెడతాడు. వారి పాపములు చాలా ఘోరమైనవి. అవి క్షమింపరానివని, వారు ఉద్దేశపూర్వకముగా తెలిసే వారని, వారు వాటిలో కూరుకుపోతారని వారిలో ఆందోళన కలిగిస్తాడు. అయితే దేవుని యొక్క కృపను గురించి జ్ఞాపకము చేసుకున్నట్లయితే, వారు చిత్తశుద్ధితో మారు మనస్సు పొందినచో, వారు క్రీస్తు ద్వారా దేవుని వాగ్దానములు వారి యెడల నెరవేరునట్లు ఆయన సన్నిధిలో ప్రాధేయపడవలెను. వారి ప్రార్ధనలు తక్షణమే జవాబులను పొందకపోయినను వారి విశ్వాసము వారిని అపజయములలోనికి నెట్టి వేయదు. వారు దేవుని యొక్క శక్తిని గట్టిగా పట్టుకొని అనగా యాకోబు ఆ దేవదూతను గట్టిగా పట్టుకొనినట్లు కడవరి కాలములో ఉన్న దేవుని ప్రజలు కూడా "నీవు నన్ను దీవించువరకు నేను నిన్ను విడువను ప్రభువా" అని వేడుకొనవలసియున్నారు.

"పాపములోనికి మోసపూరితముగా నడిపింపబడిన వారని యాకోబు యొక్క చరిత్రలో అతను పొందిన వాగ్దానము వంటి హామీని పొందుకుంటారు. యాకోబు తన పక్షమున దేవుని మీద పూర్తిగా ఆధారపడి తనను తాను పూర్తిగా దేవునికి అర్పించుకొనిన తరువాత మాత్రమే దైవశక్తి అతనికి తోడుగా ఉంటుందనే వాగ్దానమును పొందాడు. అతడు ఎన్నడు తన సొంత శక్తి మీద ఆధారపడలేదు. ఆవిధముగానే కడవరి కాలములో జీవించుచున్న విశ్వాసులు కూడా చేయవలసియున్నది. దేవుడు చేసిన బలియర్పణ ద్వారా మాత్రమే మనము రక్షింపబడబోవుచున్నాము. ఎంతమాత్రము మన శక్తి మీద ఆధారపడి కాదు" -ఎలెన్ జి వైట్ పితరులు మరియు ప్రవక్తలు, పుటలు 201-203.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. యాకోబు యొక్క బలహీనత సమయములో ఎందుకు దేవుని యొక్క కృపకు అవకాశం దొరుకుతుంది? "నేను బలహీనంగా ఉన్నపుడు బలవంతుడను" (2కొరింథి 13:10) పౌలు యొక్క అనుభవము యాకోబు అనుభవముతో సంబంధముంది.
2. బైబిలులో ఉన్న జనుల హేయమైన కృత్యములకు సంబంధించిన వివరాలను బైబిలు ఎందుకు వాటిని భద్రపర్చి బహిర్గతము చేస్తుంది? దానిలోనుండి అది ఏమి బోధిస్తుంది? దానినుండి మనకు ఎటువంటి వర్తమానము వస్తుంది?
3. విగ్రహారాధనను గూర్చి చర్చించండి. మన సంప్రదాయములలో ఉన్న, నాగరికతలో ఉన్న విగ్రహము ఏమిటి? దేవుని తప్ప లోకము ఎవరిని లేక దేనిని ఆరాధించుటలేదని ఎట్లు రూఢి పర్చుకొనగలము?

❋✶❋